క్లుప్తంగా

నాగులచవితి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో నాగప్రతిమ

కొడంగల్: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఉన్న నాగుల విగ్రహాలకు ఆలయ అర్చకులు ఆదివారం నాగుల చవితిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాలు, పెరుగు, నెయ్యి, పసుపు, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో నాగదేవతలకు అభిషేకం చేశారు. ఆలయంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

25న యాదవ యుద్ధభేరి

తాండూరు టౌన్: ఈనెల 25న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో నిర్వహించనున్న యాదవ యుద్ధభేరికి యాదవులు పెద్దఎత్తున తరలిరావాలని అఖిల భారత యాదవ సంఘం నాయకుడు మన్నె బస్వరాజ్ యాదవ్ కోరారు. ఆదివారం ఆయన తాండూరులో మాట్లాడుతూ.. యాదవులను ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని, రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమం నేటివరకు చేపట్టలేదన్నారు. ప్రభుత్వం వెంటనే రెండోవిడత గొర్రెల పంపిణీని వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. యాదవ సంఘం నాయకులు రాజు, యాదగిరి, రమేష్, గుండుయాదవ్, లాలూ, రాములు, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపనకు విరాళం



విరాళం అందజేస్తున్న మధుకర్

మర్పల్లి: మండల పరిధిలోని బూచన్‌పల్లి గ్రామంలో శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపన కోసం శివాజీ యువజన సంఘం సభ్యులకు మర్పల్లి జెడ్పీటీసీ మధుకర్ ఆదివారం రూ.50 వేలు విరాళం అందజేశారు. శివాజీ ఆశయ సాధనకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బీఆర్ఎస్ మండల యూత్ ప్రెసిడెంట్ మధుకర్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు రమేష్ మిత్ర, గ్రామ కమిటీ అధ్యక్షుడు యాదగిరి, శివాజీ యువజన సంఘం అధ్యక్షుడు మధుకర్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, మల్లేశం, ఖలీల్, రాజు, మల్లేశం, నిజాం, మధుకర్‌రెడ్డి, రమేష్ తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ గృహలక్ష్మి: ఎంపీపీ

దౌల్తాబాద్: అర్హులందరికీ గృహలక్ష్మి పథకం కింద సాయం అందేలా కృషి చేస్తామని ఎంపీపీ విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. మండలంలో 7,553 మంది గృహలక్ష్మి పథకం కింద దరఖాస్తులు చేసుకున్నారని అయితే గ్రామాల్లో క్షేత్రస్థాయిలో అధికారులు సర్వే నిర్వహిస్తున్నారన్నారు. అర్హులైన వారిని గుర్తించి విడతల వారీగా డబ్బులు మంజూరు అవుతాయన్నారు. ఎవరూ ఆందోళన చెందవద్దని.. అందరికీ అందేలా చూస్తామని అన్నారు.

ఆర్థికసాయం అందజేత

కుల్కచర్ల: కుల్కచర్ల గ్రామానికి చెందిన శివని పెద్ద రామయ్య(100) ఆదివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి స్థానిక నేతల ద్వారా బాధిత కుటుంబానికి ఆర్థికసహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మండల దళిత సంఘాల కన్వీనర్ అశోక్ కుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

'ఇంటింటికీ బీఎస్పీ' వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, నాయకులు

కొడంగల్: నియోజకవర్గంలో 'ఇంటింటికి బీఎస్పీ–గడపగడపకు ఆర్ఎస్పీ' కార్యక్రమం చేపట్టినట్లు బీఎస్పీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి నర్మద అన్నారు. ఆదివారం వారు హైదరాబాద్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర బీఎస్పీ చీఫ్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను కలిశారు. ఇంటింటికి బీఎస్పీ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. బడుగుబలహీన వర్గాలకు బీఎస్పీలో ప్రాధాన్యత ఉంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బహుజనులకు రాజ్యాధికారం నినాదంతో ముందుకు వెళ్తున్నామన్నారు. గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తాలూకా మహిళా కన్వీనర్ సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన

కొడంగల్: మండల పరిధిలోని హస్నాన్‌పూర్ గ్రామంలో ఆదివారం గృహ లక్ష్మి దరఖాస్తులను ఎంపీడీఓ పాండు పరిశీలించారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్లి విచారణ చేపట్టారు. అర్హతలను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కొండన్న, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ

- కొడంగల్ నియోజకవర్గానికి రూ.13.35 కోట్లు మంజూరు
- అవసరమైన చోట కొత్తరోడ్లు, మరమ్మతులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ప్రజలు

దౌల్తాబాద్: గ్రామీణ ప్రాంతాల్లో రహదారులకు మహర్దశ పట్టనుంది. పంచాయతీరాజ్ శాఖ నుంచి కొత్త రోడ్లతో పాటు పాడైన రోడ్లకు మరమ్మతులు చేయించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఎన్నోఏళ్లుగా రోడ్డులేక తిప్పలు పడుతున్న గ్రామాలకు రోడ్డు వేయడంతో పాటు భారీ వర్షాలకు గుంతలు పడి అధ్వాన్నంగా మారిన రోడ్ల మరమ్మతు పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. వెంటనే రహదారుల నిర్మాణాలకు టెండర్లు పిలిచి పనులు పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

రూ.13.35కోట్లు మంజూరు

కొడంగల్ నియోజకవర్గం మూడు మండలాల్లోని కొత్త బీటీ రోడ్లతో పాటు గుంతలు పడిన రోడ్లను కలుపుకుని మొత్తం 8 రోడ్లకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దౌల్తాబాద్, బొంరాస్‌పేట, కొడంగల్ మండలాల్లో రోడ్ల నిర్మాణాలకు రూ.13.35కోట్లు విడుదల చేసింది. బొంరాస్‌పేట మండలంలోని జానకంపల్లి రోడ్డుకు రూ.1.60కోట్లు, దౌల్తాబాద్ మండలంలోని నందారం నుంచి కౌడీడ్ వరకు రూ.1.50కోట్లు, బాలంపేట నుంచి అంతారం వరకు రూ.80లక్షలు, రామన్‌కుంటతండాకు రూ.1.20కోట్లు, బిచ్చాల గ్రామానికి రూ.2.25కోట్లు, కొడంగల్ మండలం రుద్రారం నుంచి పాటిమీదిపల్లి వరకు రూ.2.70కోట్లు, అంగడిరాయిచూర్ నుంచి ధర్మాపూర్ వరకు రూ.2.70కోట్లు, ఖాజాఅహ్మద్‌పల్లి రోడ్డుకు రూ.60లక్షల నిధులు మంజూరయ్యాయి.

తప్పనున్న ఇక్కట్లు

కొత్త రోడ్లు, పాత రోడ్ల మరమ్మతులతో గ్రామీణ ప్రజలకు త్వరలో ఇక్కట్లు తప్పనున్నాయి. ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో ఏళ్లక్రితం వేసిన బీటీ రోడ్లు కంకర తేలి గుంతలమయంగా మారాయి. దీంతో పలువురు వాహనదారులు ప్రమాదాల బారినపడ్డారు. బీటీ రోడ్లతో కొన్ని గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఈ పరిస్థితుల్లో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో గ్రామీణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



బలంపేట–అంతారం గ్రామాల మధ్యలో కల్వర్టు తెగి 10 సంవత్సరాలు అయ్యింది. దీంతో చాలా ఇబ్బందులు పడ్డాం. ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి కృషితో రూ.80 లక్షలు మంజూరయ్యాయి. త్వరలో వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయిస్తాం. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు.

– రామకృష్ణ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్

మరమ్మతులు చేయిస్తాం



మండలంలోని చాలా రోడ్లు పాడయ్యాయి. దీంతో మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరగా నిధులు మంజూరు చేశారు. వీలైనంత త్వరగా రోడ్ల మరమ్మతు పనులు చేపడతాం.

– విజయ్‌కుమార్, ఎంపీపీ, దౌల్తాబాద్

కొత్త పీఆర్సీ ప్రకటించాలి: ఎస్టీయూ



సమావేశంలో మాట్లాడుతున్న వేణుగోపాల్

కొడంగల్: ప్రభుత్వం వెంటనే కొత్త పీఆర్సీ ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేణుగోపాల్ అన్నారు. ఎస్టీయూ జిల్లా ద్వితీయ కార్యవర్గ సమావేశం ఆదివారం పట్టణంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఆర్సీ కమిటీని ప్రభుత్వం వెంటనే నియమించాలన్నారు. ఐఆర్ ఇచ్చి ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాలకు న్యాయం చేయాలన్నారు. టీచర్ల బదిలీల ప్రక్రియను వెంటనే చేపట్టాలన్నారు. బదిలీలు పదోన్నతుల కోసం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సీపీఎస్‌ను రద్దుచేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్, నాయకులు.. శ్రీనివాసరావు, విష్ణుకుమార్ పాల్గొన్నారు.

24న ఉచిత కంటి వైద్య శిబిరం

కొడంగల్: ఈనెల 24న గురువారం ఉదయం 10 గంటలకు కొడంగల్ ప్రభుత్వాస్పత్రిలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామని నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. లయన్స్‌క్లబ్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆప్తాల్మిక్ అసిస్టెంట్ హరినాథ్ తెలిపారు. కంటి సమస్యలు ఉన్నవారు ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకొని రావాలన్నారు. ఉచితంగా మందులు, కంటి ఆపరేషన్లు చేస్తామన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కందూరు రాంరెడ్డి ఆస్పత్రిలో కంటిఆపరేషన్లు జరుగుతాయని అన్నారు.

మైనార్టీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కొడంగల్: నియోజకవర్గంలోని కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాలకు చెందిన ముస్లిం మైనార్టీ విద్యార్థులకు ఆదివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మహ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకులు షేక్ సాహెబ్, అబ్దుల్ బాసిత్, మహ్మద్ యూసుఫ్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జమాయత్ ఉలామా మదర్సా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వ్యాసరచన పోటీలో కొడంగల్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో నాసీర్, ఆసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

తాండూర్ పట్టణంలో..

తాండూరు: జమాతే ఉలేమా ఏ హింద్ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పట్టణంలోని మెట్రో ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ పోటీలకు 2,300 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జమాత్ ఉలామా వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మౌలానా మహమ్మద్ అబ్దుల్లా అజర్ ఖాస్మీ, తాండూరు ముస్లిం మతపెద్దలు, అసోసియేషన్ ప్రతినిధులు, విద్యార్థులు తదితరులున్నారు.



కొడంగల్: వ్యాసరచన పోటీలో పాల్గొన్న మైనార్టీ యువత

అనాథ చిన్నారులకు చేయూత



శివ, పూర్ణిమను ఆశ్రమంలో చేర్పిస్తున్న అమ్మానాన్న ఫౌండేషన్ సభ్యులు

కొడంగల్: మండల పరిధిలోని చిట్లపల్లి గ్రామానికి చెందిన సురేందర్, చుక్కమ్మ దంపతులు కొన్నేళ్ల క్రితం చనిపోయారు. దీంతో వారి ఇద్దరు పిల్లలు శివ(6), పూర్ణిమ(4) అనాథలుగా మిగిలారు. కొడంగల్‌కు చెందిన అమ్మానాన్న ఫౌండేషన్ సభ్యులు వారిని చేరదీసి మానవత్వం చాటుకున్నారు. ఈ చిన్నారులను ఆదివారం హైదరాబాద్ తీసుకెళ్లి దుండిగల్ ప్రాంతంలో ఉన్న శాంత బాపట్ల చిన్న పిల్లల ఆశ్రమంలో చేర్పించారు. అక్కడే వారికి ఉచిత విద్యతో పాటు వసతి కల్పించారు. కార్యక్రమంలో అమ్మానాన్న ఫౌండేషన్ సభ్యులు ప్రవీణ్‌కుమార్, వెంకట్‌రాములు, నరేష్‌కుమార్, డాక్టర్ చందు, అనిల్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అక్షర జ్ఞానానికి ఆద్యుడు నారాయణగురు

అంబేడ్కర్ సంఘం తాలూకా అధ్యక్షుడు రమేశ్‌బాబు



నారాయణగురు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న రమేశ్‌బాబు, నాయకులు

బొంరాస్‌పేట: అక్షరాస్యతలో ఆదర్శంగా నిలిచి ప్రత్యేక గుర్తింపు పొందిన కేరళ రాష్ట్రానికి అక్షర గురువు.. నారాయణగురు అని అంబేడ్కర్ సంఘం తాలూకా అధ్యక్షుడు రమేశ్‌బాబు కొనియాడారు. ఆదివారం మండల పరిధిలోని తుంకిమెట్ల, నాందార్‌పూర్‌లో నారాయణగురు జయంతి వేడుకలు నిర్వహించారు. గుడినే బడిగా మలిచి ఆధ్యాత్మికతతోపాటు అక్షరజ్ఞానానికి ఆద్యుడు నారాయణగురు అన్నారు. అంబేడ్కర్‌లాంటి మహనీయులకు నారాయణగురు ఆదర్శవంతులని అన్నారు. ఇందులో రచయిత వెంకటయ్య, వెంకటయ్య, కృష్ణ, వెంకటయ్య తదితరులున్నారు.



తాండూరు టౌన్: రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



పరిగి: రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న టీఆర్ఆర్, నాయకులు

ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి

తాండూరు టౌన్: భారత మాజీ ప్రధాని, దివంగత నేత రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రాజీవ్ కాలనీలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయ సాధన కోసం యువత కృషి చేయాలన్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు రమేష్ మహరాజ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, నాయకులు బస్వరాజ్, అనిల్, నాగేష్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రగతికి బాటలు..

కుల్కచర్ల: పారిశ్రామిక ప్రగతికి బాటలు వేసిన గొప్ప నాయకుడు దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అని చౌడాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్‌కుమార్ అన్నారు. రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆదివారం చౌడాపూర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్థానిక నాయకులు యాదయ్య, సలీం, రాము, లింగం, బాలయ్య, చందు పాల్గొన్నారు.

సేవలు చిరస్మరణీయం..

పరిగి: మాజీ ప్రధాని, దివంగత నేత రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయమని డీసీసీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాజీవ్‌గాంధీ జయంతిని పరిగి పట్టణకేంద్రంలో టీఆర్ఆర్ నివాసంలో ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, దొంగ ఎన్కెపల్లి సర్పంచ్ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

'గృహలక్ష్మి సాయం అందించండి'

వికారాబాద్ అర్బన్: ప్రభుత్వమే 2007లో పేదలకు 60 గజాల ఇంటి స్థలాలు ఇచ్చింది. ఇప్పుడు ఆ స్థలాలకు గృహలక్ష్మి పథకం వర్తించకపోవడంతో పేదలు లబోదిబోమంటున్నారు. మున్సిపల్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప, రామయ్యగూడ మధ్యలో ఉన్న ప్రభుత్వ భూమిలో అప్పటి సబ్ కలెక్టర్ ముత్యాల రాజు పేదలకు 60 గజాల చొప్పున పంపిణీ చేశారు. రాజీవ్ గృహకల్పలో ఇళ్లు దక్కలేని చాలామంది పేదలకు ఆయన ఈ ఖాళీ ఇంటి స్థలాలను కేటాయించారు. ప్రభుత్వం ఇచ్చిన ఈ ఖాళీ స్థలంలో కొంత మంది అక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. కొందరు ఎలాంటి నిర్మాణాలు చేయలేదు. నిర్మాణాలు చేసిన వాటికి మున్సిపల్ అధికారులు ఇంటి నంబర్లు సైతం కేటాయించారు. ఆ ఇళ్లకు విద్యుత్ మీటర్లు కూడా ఇచ్చారు. ప్రతి ఏటా మున్సిపల్ అధికారులు ఇంటిపన్ను కూడా వసూల్ చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా, అక్కడ ఖాళీ స్థలం ఉన్న మిగతా లబ్ధిదారులు ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోగా.. అధికారులు కొత్త విషయాన్ని వెలుగులోకి తీసుకొస్తున్నారు. క్షేత్రస్థాయి విచారణకు వస్తున్న అధికారులు, ఈ ఖాళీ స్థలాలపై కోర్టు కేసు ఉందని, ఈ స్థలం చూపించి దరఖాస్తు చేసుకున్న వారికి గృహలక్ష్మి మంజూరు కాదని నేరుగా చెప్పేస్తున్నారు. దీంతో సుమారు 100 మంది లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు. కోర్టు కేసు ఉంటే ఇప్పటికే అక్కడ ఇళ్లు నిర్మించుకున్న వారికి మున్సిపల్ అనుమతులు ఎలా ఇచ్చారని, విద్యుత్ కనెక్షన్ ఎలా ఇచ్చారని మిగతా లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. మిగతావారి మాదిరిగానే తమకు కూడా అక్కడ నివాసం ఏర్పాటు చేసుకునేందుకు గృహలక్ష్మి పథకాన్ని వర్తింపజేయాలని కోరుతున్నారు. కేసుల పేరుతో ఇవ్వకుంటే సుమారు 100 పేద కుటుంబాలకు అన్యాయం జరుగుతుందని వాపోతున్నారు.

నిధులు కేటాయించాలని వినతి

మంత్రి, ఎంపీని కలిసిన చేవెళ్ల బీఆర్ఎస్ నాయకులు



మంత్రి సబితారెడ్డితో చేవెళ్ల బీఆర్ఎస్ నాయకులు

చేవెళ్ల: గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని చేవెళ్ల బీఆర్ఎస్ నాయకులు మంత్రి సబితారెడ్డి, చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని వారి నివాసాలకు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు గ్రామాల్లోని సమస్యలను వారి దృష్టికి తెచ్చారు. వాటి అభివృద్ధి కోసం చర్యలు తీసుకోవాలన్నారు. దీనికి వారు సానుకులంగా స్పందించారన్నారు. ఈ నెల 28వ మల్లారెడ్డిగూడలో సర్పంచ్ మోహన్‌రెడ్డి నూతనంగా నిర్మింపజేసిన గ్రామ పంచాయతీ భవనం, సీసీ రోడ్డు, అంగన్‌వాడీ భవనాల ప్రారంభోత్సవాలకు మంత్రి, ఎంపీలను ఆహ్వానించినట్లు సర్పంచ్ మోహన్‌రెడ్డి తెలిపారు. వైస్ ఎంపీపీ శివప్రసాద్, ఊరేళ్ల సర్పంచ్ జహంగీర్, సీనియర్ నాయకులు మర్పల్లి క్రిష్టారెడ్డి, శేరి పెంటారెడ్డి, జంగారెడ్డి, వితలయ్య పాల్గొన్నారు.



ప్రజాధనం వృథా

ప్రారంభానికి నోచుకోని మీటింగ్ హాల్

బంట్వారం: లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన మీటింగ్ హాల్ ఏళ్ల తరబడి ప్రారంభానికి నోచుకోవడం లేదు. బంట్వారం మండల కేంద్రంలో దాదాపు 13 ఏళ్ల కిందట మీటింగ్ హాల్ నిర్మాణం చేపట్టారు. అప్పట్లో రంగారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఉన్న పట్నం సునీతారెడ్డి ఇందుకు అవసరమైన జెడ్పీ నిధులను మంజూరు చేశారు. భవన నిర్మాణం పూర్తయినప్పటికీ చిన్నపాటి పనులు మిగిలి ఉండటంతో ఏళ్ల తరబడి నిరుపయోగంగానే పడి ఉంది. ఇదిలా ఉండగా ఇదే భవనానికి అదనంగా మరో రూ.5లక్షలు జెడ్పీ నిధులను సునీతారెడ్డి ఐదేళ్ల కిందట మంజూరు చేశారు. అయినప్పటికీ అసంపూర్తి పనులు మాత్రం నేటికీ పూర్తికాలేదు. ఇప్పటికైనా సంబంధిత పీఆర్ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎక్స్‌ప్రెస్ రైలును సద్వినియోగం చేసుకోండి

- సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సభ్యుడు డాక్టర్ చంద్రశేఖర్



చెన్నైఎగ్మోర్ రైలుకు స్వాగతం పలుకుతున్న పట్టణవాసులు

షాద్‌నగర్‌రూరల్: షాద్‌నగర్ మీదుగా వెళుతున్న చెన్నైఎగ్మోర్ ఎక్స్‌ప్రెస్ రైలును పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సభ్యుడు డాక్టర్‌చంద్రశేఖర్ అన్నారు. చెన్నైఎగ్మోర్ ఎక్స్‌ప్రెస్ రైలును షాద్‌నగర్‌లో నిలపాలని ప్రయాణికుల కోరిక మేరకు రైల్వే ఉన్నతాధికారులు ఆదివారం ఈ రైలును నిలిపారు. ఇక్కడ రైలు స్టాప్‌నకు అనుమతులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌యూసీసీ సభ్యులు చెన్నై ఎగ్మోర్ రైలుకు స్వాగతం పలికారు. రైలుకు అరటి ఆకులు, మామిడి తోరణాలతో ముస్తాబుచేసి కొబ్బరికాయలు కొట్టారు. రైలు డ్రైవర్లకు మిఠాయిలు తినిపించారు. అనంతరం సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సభ్యులు డాక్టర్‌చంద్రశేఖర్, దిడ్డిగోపాల్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్ ఎంపీ మన్నెశ్రీనివాస్‌రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌కృషితో చెన్నైఎగ్మోర్ రైలు పట్టణంలో నిలిపేందుకు అనుమతులు లభించాయన్నారు. షాద్‌నగర్ స్టాపునకు సహకరించిన సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులకు పట్టణ ప్రజల తరుపున ప్రత్యేక ధన్యవాదాలను తెలుపుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యాదగిరి యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, రవింద్రనాథ్‌గుప్తా, సురేందర్‌రెడ్డి, నర్సింలుయాదవ్, పాండు, హరిభూషణ్, రంగన్నగౌడ్, గంగాధర్, మహేందర్, విష్ణు, ధరణీధర్, ఫణీందర్, నవీన్, గణేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

బీటీ వేయాలంటూ నేతల ధర్నా

బొంరాస్‌పేట: మండల పరిధిలోని కొత్తూరు–యాలాల మండలాల మధ్యన దేవనూరు రోడ్డును బీటీ రోడ్డుగా చేయాలంటూ ఎప్పట్నుంచో ప్రజాసంఘాల నాయకులు.. ఎప్పట్నుంచో ధర్నాలు, ఆందోళనలు చేపడుతున్నారు. ఏళ్లు గడుస్తున్నా నేతలు, అధికారుల్లో ఎలాంటి మార్పు లేకపోవడంతో ప్రజాసంఘాల నాయకులు తుంకిమెట్ల జాతీయరహదారిపై ఆదివారం ధర్నాకు దిగారు. పోలీసులు వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ వారు రోడ్డు వేస్తామని హామీ ఇచ్చేవరకు ధర్నాను విరమించేది లేదని మొండికేశారు. దీంతో పోలీసులు, నాయకుల ఆదేశాల మేరకు సంబంధిత కాంట్రాక్టర్ స్పందించాడు. బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపడతామని హామీ ఇవ్వడంతో ప్రజాసంఘాల నాయకులు విరమించారు. ఇందులో ప్రజాసంఘాల నాయకులు చంద్రయ్య, సూర్యానాయక్, లక్ష్మయ్య, దస్తయ్య, లక్ష్మణ్ తదితరులున్నారు.